


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 20-09-2025 | సంపుటి - 27 | సంచిక - 129 | రూ : 4 | పేజీలు: 8




2లో

## ఈసీ కీలక నిర్ణయం..
## 474 రాజకీయ పార్టీలపై వేటు

474 పార్టీలను తొలగించిన కేంద్ర ఎన్నికల సంఘం

- నిబంధనలు ఉల్లంఘించిన పార్టీలపై ఈసీ కఠిన చర్యలు
- రెండో దశలో మరో 474 పార్టీల నమోదు రద్దు
- ఆరేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడమే ప్రధాన కారణం
- రెండు నెలల్లో మొత్తం 808 పార్టీల తొలగింపు
- దేశంలో ప్రస్తుతం 2,046 గుర్తింపు లేని పార్టీలు

## ఒక ఆడబిడ్డపై నలుగురు కలిసి
# దాడి చేస్తున్నారు!
## కవిత వ్యవహారంపై రేవంత్ రెడ్డి

- కవిత వ్యవహారమంతా కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమేనని వ్యాఖ్య
- కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కిషన్ రెడ్డి పదేపదే చెప్పారని వెల్లడి
- స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న రేవంత్ రెడ్డి
- పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్ట నియమాలు ఏవీ లేవన్న ముఖ్యమంత్రి



2లో



2లో

## వయనాడ్‌లో అరటిపండ్లతో ప్రియాంక గాంధీ తులాభారం

- నియోజకవర్గంలో వారం రోజులుగా కొనసాగుతున్న ప్రియాంక పర్యటన
- శుక్రవారం వయనాడ్ చేరుకున్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీ

## సీఎం ఛాంబర్ లో క్యాబినెట్ భేటీ
# నాలా ఫీజు రద్దుకు ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీ
- నాలా ఫీజు రద్దు చట్ట సవరణకు ఆమోదం
- వాహనమిత్ర కింద రూ.15 వేల సాయానికి గ్రీన్ సిగ్నల్
- అసెంబ్లీలో ప్రవేశపెట్టే 13 బిల్లులకు ఆమోదముద్ర
- భారీ ప్రాజెక్టుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు
- ఏపీ జీఎస్టీ బిల్లు 2025 సవరణలకు కేబినెట్ ఓకే



2లో




2లో

## తెలంగాణలో సీఎం రిలీఫ్ ఫండ్ కుంభకోణం

మరో ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

## వీధి వ్యాపారికి, సీఈఓకి
# ఒకే టెక్నాలజీ: ప్రధాని మోదీ

- వీధి వ్యాపారి, కార్పొరేట్ అధికారికి ఒకే యూపీఐ విధానమని వెల్లడి
- వీధి వ్యాపారి, కార్పొరేట్ అధికారికి ఒకే యూపీఐ విధానమని వెల్లడి
- అంత్యోదయ స్ఫూర్తితోనే ప్రతి డిజిటల్ పథకం అమలు చేస్తున్నామన్న మంత్రి అశ్విని వైష్ణవ్
- గుజరాత్ అనుభవంతో దేశంలో డిజిటల్ విప్లవమని వ్యాఖ్య

2లో



## అందుకే
# పార్టీ మారా..

అసలు విషయం చెప్పిన కడియం శ్రీహరి



2లో






## మన శరీరం
## తిరుగుబాటు చేస్తుంది

: ఐఎస్ఎస్ అనుభవాన్ని వెల్లడించిన శుభాంశు శుక్లా



2లో




# ఒక ఆడబిడ్డపై నలుగురు కలిసి దాడి చేస్తున్నారు!: కవిత వ్యవహారంపై రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 :** కల్వకుంట్ల కవిత వ్యవహారం, పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, కవిత వ్యవహారం పూర్తిగా కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమేనని వ్యాఖ్యానించారు. ఒక ఆడబిడ్డపై నలుగురు కలిసి దాడి చేస్తున్నారని అన్నారు. కుటుంబ వ్యవహారంతో సామాన్య ప్రజలకు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు సామాజికంగా బహిష్కరించారని వ్యాఖ్యానించారు. 2014-19 మధ్య కేసీఆర్ కేబినెట్‌లో ఒక్క మహిళ కూడా లేరని గుర్తు చేశారు. ఉద్యమం పేరుతో కేసీఆర్ కొన్ని వందల మంది పిల్లల ఉసురు పోసుకున్నారని ఆయన ఆరోపించారు. అది ఊరికే పోలేదని అన్నారు. హైదరాబాద్ మెట్రో విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేటీఆర్ కలిసి అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు. ఎల్ అండ్ టీతో ఒప్పందం చేసుకుంటేనే అనుమతులు ఇస్తామని కేంద్రం చెబుతోందని అన్నారు. కేంద్రంలో ఉన్న కిషన్ రెడ్డి ఇలాంటి మెలికలు పెడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కిషన్ రెడ్డి పదేపదే డిమాండ్ చేశారని, అలా చేస్తే 48 గంటల్లోనే ఈ కేసు విచారణ చేపట్టేలా చూస్తానని అన్నారని తెలిపారు. సీబీఐకి ఈ కేసును ఇచ్చి ఇన్ని రోజులు అవుతున్నా కిషన్ రెడ్డి ఎక్కడా మాట్లాడటం లేదని అన్నారు. సీబీఐ దర్యాప్తు ఆపాలని కేటీఆర్ కోరడంతో కిషన్ రెడ్డి దానిని అమలు చేశారని ఆరోపించారు. వారిద్దరి మధ్య అవినాభావ సంబంధం ఉందని అన్నారు.

*** స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకోలేదు**

స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ముఖ్యమంత్రి చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి మూడు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే గడువు అంశం కోర్టు పరిధిలో ఉందని అన్నారు. దీనిపై సుప్రీంకోర్టు ఏం చెబుతుందో వేచి చూస్తున్నామని తెలిపారు. న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

*** ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై స్పందించిన ముఖ్యమంత్రి**

ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్ట నియమాలు ఏవీ స్పష్టంగా లేవని ఆయన అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై బీఆర్ఎస్ నేతలకే స్పష్టత లేదని అన్నారు. ఆ పార్టీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని అసెంబ్లీలో హరీశ్ రావు చెప్పారని గుర్తు చేశారు. 37 మంది కాదని కేటీఆర్ ఇంకో మాట చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఇంటికొచ్చిన వారికి కండువా వేస్తే పార్టీ మారినట్లు అవుతుందా? అని ప్రశ్నించారు.

## అందుకే పార్టీ మారా.. అసలు విషయం చెప్పిన కడియం శ్రీహరి

- **అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
- **సీఎం రేవంత్ రెడ్డి నిధులు కూడా ఇచ్చారని వెల్లడి**
- **కడియం రాజీనామా చేయాలంటూ బీఆర్ఎస్ పోస్టు కార్డుల ఉద్యమం**
- **నిరసనల్లో పాల్గొంటున్న రైతులు, స్థానిక నేతలు**
- **పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు**

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 19 :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాజీనామా చేయాలంటూ సొంత నియోజకవర్గంలోనే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక రైతులు ఆయనపై పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించి, తమ నిరసనను వినూత్నంగా తెలియజేస్తున్నారు. మరోవైపు, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం నోటీసులు జారీ చేయడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. ఈ పరిణామాలపై వరంగల్‌లో కడియం శ్రీహరి స్పందించారు. కేవలం నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొనే తాను కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. "ఎన్నికల్లో ప్రజలకు అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చాను. వారు నన్ను నమ్మి గెలిపించారు. కానీ, బీఆర్ఎస్ ఓడిపోవడంతో నియోజకవర్గానికి అన్యాయం జరుగుతుందని భావించాను. అందుకే అధికార పార్టీతో కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని అనుకున్నాను" అని ఆయన వివరించారు. గత ఏడాదిన్నరగా కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని, తన విజ్ఞప్తి మేరకు దేవాదుల కాల్వల మరమ్మతులకు, ఇతర అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచి నిధులు కూడా మంజూరు చేశారని కడియం శ్రీహరి తెలిపారు. అయితే, ఆయన వివరణతో బీఆర్ఎస్ శ్రేణులు ఏకీభవించడం లేదు. కడియం ప్రజాతీర్పును అవమానించారని, వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ పోస్టు కార్డుల ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తున్నారు. నియోజకవర్గంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని రైతులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానికంగా కడియం శ్రీహరిపై ఒత్తిడి రోజురోజుకు పెరుగుతోంది.

## ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలపై ఈసీ వేటు!



**ఢిల్లీ, సెప్టెంబర్ 19 :** దేశంలో కేవలం కాగితాలకే పరిమితమైన రాజకీయ పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కొరడా ఝుళిపించింది. నిబంధనలను పాటించని వందలాది పార్టీలపై కఠిన చర్యలు తీసుకుంది. గత రెండు నెలల వ్యవధిలోనే ఏకంగా 808 రిజిస్టర్ అయి గుర్తింపు లేని రాజకీయ పార్టీల నమోదును రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 9న తొలి దశలో 334 పార్టీల నమోదును ఈసీ రద్దు చేసింది. రెండో దశ చర్యల్లో భాగంగా, శుక్రవారం మరో 474 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో వెల్లడించింది. గత ఆరేళ్లుగా వరుసగా ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకపోవడం, ఇతర నిబంధనలను ఉల్లంఘించడమే ఈ నిర్ణయానికి కారణమని స్పష్టం చేసింది. తాజాగా తీసుకున్న చర్యలతో కలిపి మొత్తం తొలగించిన పార్టీల సంఖ్య 808కి చేరింది. ఈసీ తాజా ప్రక్షాళనతో, దేశంలో రిజిస్టర్ అయి గుర్తింపు లేని పార్టీల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ చర్యలతో గుర్తింపు లేని రాజకీయ పార్టీల సంఖ్య 2,046కి తగ్గింది.

## యనాడ్‌లో అరటిపండ్లతో ప్రియాంక గాంధీ తులాభారం

**యానాడ్, సెప్టెంబర్ 19 :** కాంగ్రెస్ నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ తన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె ముక్కం మనస్సెరీలోని శ్రీ కున్నత్ మహావిష్ణు ఆలయాన్ని సందర్శించి, అరటిపండ్లతో తులాభారం వేయించుకున్నారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రియాంకకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా వాయనాడ్ చేరుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వారం రోజులుగా తన లోక్‌సభ నియోజకవర్గంలో పర్యటిస్తున్న ప్రియాంక గాంధీ, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. సెప్టెంబర్ 12న ప్రారంభమైన ఈ పర్యటనలో భాగంగా ఆమె వివిధ సామాజిక, మత, వర్గాల నాయకులను వారి ఇళ్ల వద్దే కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా యువత, మహిళలతో ప్రత్యేకంగా సమావేశమవుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చర్చిస్తున్నారు. ఆలయంలో తులాభారం అనంతరం, కొత్తగా నిర్మించిన ఆలయ రథాన్ని ప్రియాంక గాంధీ పరిశీలించారు. దాని నిర్మాణంలో పాలుపంచుకున్న శిల్పుల నైపుణ్యాన్ని అభినందించారు. ప్రియాంక ఆలయ సందర్శన సాంస్కృతిక సామరస్యాన్ని, ప్రజలతో ఆమెకున్న భావోద్వేగ బంధాన్ని తెలియజేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మరోవైపు, శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో సోనియా, రాహుల్ కరిపూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వయనాడ్ చేరుకున్నారు. రాబోయే రోజుల్లో పంచాయతీ, బ్లాక్ స్థాయి సమావేశాల్లో పాల్గొననున్న ప్రియాంక, స్థానిక సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

## సీఎం చంద్రబాబు ఛాంబర్ లో క్యాబినెట్ భేటీ



**అమరావతి, సెప్టెంబర్ 19 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ భేటీలో ప్రజలకు లబ్ధి చేకూర్చే పలు ముఖ్యమైన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. వీటిలో ప్రధానంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు మార్చేటప్పుడు విధించే నాలా (వ్యవసాయేతర భూముల మదింపు) ఫీజును రద్దు చేసేందుకు ఉద్దేశించిన చట్ట సవరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సమావేశంలో తీసుకున్న ఇతర నిర్ణయాలను రాష్ట్ర హోంమంత్రి అనిత మీడియాకు వెల్లడించారు. వాహనమిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసిందని ఆమె తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుల వేగవంతమైన అమలు కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి కూడా కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు వీలుగా మొత్తం 13 బిల్లులకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని హోంమంత్రి వివరించారు. వీటిలో ఏపీ జీఎస్టీ బిల్లు 2025కు సంబంధించిన సవరణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన తేదీలను ఖరారు చేసే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించినట్లు ఆమె తెలిపారు. ఈ నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## వీధి వ్యాపారికి, సీఈఓకి ఒకే టెక్నాలజీ: ప్రధాని మోదీ

- **అంత్యోదయ స్ఫూర్తితోనే ప్రతి డిజిటల్ పథకం అమలు చేస్తున్నామన్న మంత్రి అశ్విని వైష్ణవ్**
- **గుజరాత్ అనుభవంతో దేశంలో డిజిటల్ విప్లవమని వ్యాఖ్య**

**ఢిల్లీ, సెప్టెంబర్ 19 :** దేశంలో టెక్నాలజీనే అతిపెద్ద ఈక్వలైజర్ (సమానత్వ సాధనం) అని, ఇది వీధి వ్యాపారి నుంచి కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ వరకు ప్రతి ఒక్కరికీ సాధికారతను అందించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాసిన ఒక వ్యాసానికి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో స్పందించారు. గతంలో ప్రభుత్వ పత్రం కావాలంటే ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు టెక్నాలజీ పుణ్యమా అని అన్నీ మొబైల్ ఫోన్‌లోనే అందుబాటులోకి వచ్చాయని అశ్విని వైష్ణవ్ తన వ్యాసంలో వివరించారు. దీనిపై ప్రధాని స్పందిస్తూ, "ఇండియా స్టాక్, యూపీఐ, జామ్ ట్రినిటీ, కొవిన్ వంటి కార్యక్రమాలతో ఆవిష్కరణలు, సమ్మిళిత వృద్ధి ప్రజల జీవితాలను మార్చాయి. పాలన మెరుగుపడటంతో పాటు ప్రపంచ వేదికపై భారత్ పాత్రను బలోపేతం చేశాయి" అని మోదీ తెలిపారు. అంతకుముందు తన వ్యాసంలో... ప్రధాని మోదీ దార్శనికతలో టెక్నాలజీకి ఎలాంటి అంతరాలు లేవని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. "ముంబైలోని ఒక వీధి వ్యాపారి, ఒక కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఇద్దరూ ఒకే యూపీఐ చెల్లింపుల వ్యవస్థను వాడుతున్నారు. ఇదే అసలైన సమానత్వం. క్యూలో నిల్చున్న చివరి వ్యక్తికి కూడా ఫలాలు అందాలనే 'అంత్యోదయ' స్ఫూర్తితోనే ప్రతి డిజిటల్ కార్యక్రమం రూపుదిద్దుకుంది" అని ఆయన పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ ప్రారంభించిన ప్రయోగాలు, దేశవ్యాప్త డిజిటల్ విప్లవానికి పునాది వేశాయని ఆయన అభిప్రాయపడ్డారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు జ్యోతిగ్రామ్, నర్మదా కాలువపై సోలార్ ప్యానెళ్లు, ఇధర, స్వాగత్ వంటి పథకాలతో టెక్నాలజీని పాలనలో భాగం చేశారని వైష్ణవ్ గుర్తుచేశారు. 2014లో ప్రధాని అయ్యాక గుజరాత్ అనుభవాన్ని దేశవ్యాప్తంగా అమలు చేశారని అన్నారు. దీనిలో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలైన 'ఇండియా స్టాక్'కు రూపకల్పన జరిగిందని తెలిపారు. 'జామ్' (జన్‌ధన్‌ఆధార్‌మొబైల్) త్రయంతో 53 కోట్లకు పైగా ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకువచ్చారని వివరించారు. ఆధార్ ద్వారా 142 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపు లభించిందని, ప్రభుత్వ సేవలు సులభతరం అయ్యాయని చెప్పారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంతో దళారుల వ్యవస్థకు తెరపడిందని, దీనివల్ల ఇప్పటివరకు రూ. 4.3 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఆదా అయిందని ఆయన తన వ్యాసంలో స్పష్టం చేశారు.

## తెలంగాణలో సీఎం రిలీఫ్ ఫండ్ కుంభకోణం

తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిధుల దుర్వినియోగం కేసులో తాజాగా మరో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ పోలీసులు శుక్రవారం వెల్లడించారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. నిందితులందరూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందినవారని పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, పొట్ల రవి (46), జనగామ నాగరాజు (40), మటేటి భాస్కర్ (33), ధర్మారం రాజు (50), కంపిలి సంతోష్ (35), చిట్యాల లక్ష్మి (65), అసెంపెల్లి లక్ష్మి అనే ఏడుగురిని అరెస్ట్ చేశారు. వీరంతా కలిసి సుమారు రూ. 8.71 లక్షల సీఎంఆర్ఎఫ్ నిధులను స్వాహా చేసినట్లు తేలింది. నకిలీ లబ్ధిదారులుగా అవతారమెత్తి, అర్హులైన వారి పేర్లతో మంజూరైన చెక్కులను తమ సొంత బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకుని నిధులను డ్రా చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిధుల దుర్వినియోగం కేసులో జులైలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత, గత ప్రభుత్వంలోని ఒక మంత్రి కార్యాలయంలో పనిచేసిన జోగుల నరేశ్ కుమార్ అనే వ్యక్తి పంపిణీ చేయని 230 సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన వెంట తీసుకెళ్లాడు. లబ్ధిదారులు సంప్రదించని చెక్కులను గుర్తించి, వారి పేర్లతో నకిలీ బ్యాంకు ఖాతాలు సృష్టించి నిధులను కాజేశారు. తాజాగా అరెస్టయిన ఏడుగురు కూడా ఈ కుట్రలో భాగస్వాములేనని పోలీసులు పేర్కొన్నారు. నిందితులపై ఐపీసీ సెక్షన్లు 409, 417, 419, 467, 120(B)లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 66(C) కింద కేసులు నమోదు చేశారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని, దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

## 'మన శరీరం తిరుగుబాటు చేస్తుంది' : ఐఎస్ఎస్ అనుభవాన్ని వెల్లడించిన శుభాంశు శుక్లా



**ఢిల్లీ, సెప్టెంబర్ 19 :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఆయన అంతరిక్షంలో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యల గురించి తాజాగా వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "స్పేస్ మిషన్ ప్రారంభమైన దగ్గరి నుంచి ఎంతో ఉత్సుకత ఉంటుంది. అయితే మనం మైక్రోగ్రావిటీ పరిస్థితులకు చేరుకుంటాం. అవి మన శరీరానికి పూర్తిగా కొత్త. దాంతో అంతా మారిపోతుంది. రక్తప్రసరణలో తేడా వస్తుంది. ముఖం ఉబ్బుతుంది. గుండెవేగం మందగిస్తుంది. మీ వెన్నెముక సాగుతుంది. తరచూ నడుము నొప్పి వస్తుంటుంది. మీ పొట్టలోని పదార్థాలన్నీ తేలినట్టుగా అనిపిస్తాయి. దాంతో ఆకలి అనిపించదు. అంతరిక్షంలోకి వెళ్లిన మరుక్షణం నుంచే ఈ మార్పులన్నీ వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మనం శరీరం తిరగబడుతుంది" అని శుక్లా వెల్లడించారు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆ సంభాషణకు ముందు తాను క్లిష్ట పరిస్థితి ఎదుర్కొన్నట్లు చెప్పారు. అప్పుడు తనకు వికారంగా అనిపించిందని, తలనొప్పితో బాధపడ్డానని చెప్పారు. "వికారానికి మందులు వేసుకుంటే మగత ఉంటుందని అవి కూడా వేసుకునే వీలు లేకుండా పోయింది" అని చెప్పారు. అప్పుడు తమ బృందం సభ్యులు ఎంతో సహకరించారని చెప్పారు. అక్కడ వ్యోమగాములు ఒకరిపై ఒకరు ఆధారపడాల్సి ఉంటుందని అన్నారు. ఐఎస్ఎస్‌లోని పరిస్థితులు మన సహనానికి పరీక్ష పెడతాయని చెప్పారు. అయితే బృంద కృషి, పట్టుదల ఎంతో అవసరం అని అన్నారు. అంతరిక్ష యాత్ర కోసం ఏడాది కాలం అమెరికా శిక్షణ పొందిన శుభాంశు శుక్లా.. జూన్ 25 నుంచి జులై 15 వరకూ ఆయన రోదసీ యాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే.

# అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

*** బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : అర్హులైన ప్రతి ఒక్కరూ ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. సూరారం డివిజన్ షాపూర్ సంజయ్ గాంధీ నగర్ కు చెందిన భారతం ప్రభావతి భర్త బి. వెంకట్ రావు, గాజుల రామారం డివిజన్ లో నివాసం ఉండే దూదేకుల ఖలీల్ తండ్రి జలీల్ లకు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకులు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిదారులు భారతం ప్రభావతి (1.10 లక్షలు),దూదేకుల ఖలీల్ (2.10 లక్షలు) లకు మంజూరు చేయించారు. మంజూరైన చెక్కులను శుక్రవారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల చేతులమీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల పాలిటా వరమన్నారు.



ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకునే నాయకులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అని అన్నారు. .ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, సమ్మయ్య యాదవ్, సుంకరి చందు, చిన్నా చౌదరి, శివా నాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దసరాకు ఊరు వేళ్తే.. సమాచారం ఇవ్వండి..

*** జోగిపేట సీఐ అనిల్ కుమార్...**
*** ప్రచార రథాన్ని ప్రారంభించిన సీఐ, ఎస్ఐలు..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: దసరా పండుగకు ఊరు వేళ్తే పోలీసులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని జోగిపేట సీఐ అనీల్ కుమార్ సూచించారు. ప్రజల్లో అవగాహనను కల్పించడం కోసం శుక్రవారం జోగిపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ అనిల్ కుమార్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగకు స్వంత గ్రామాలకు వేళ్లాలనుకునే వారు వారి అడ్రస్, ఫోన్ నంబర్‌ను పోలీస్ స్టేషన్‌లో ఇచ్చినట్లయితే పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఇంటి తాళాలను పూలకుండీలలో, డొర్ మ్యాట్స్ కింద, షూ రాక్స్‌లలో వేయకూడదని, ఇంటిలోని బంగారం, వెండి వస్తువులు మీ వెంటే తీసుకేళ్లాలన్నారు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొవాలన్నారు. ఇంటికి సీసీ కెమోరాలను ఏర్పాటు చేసుకుంటే, కెమోరాను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలన్నారు. పనిమనిషి ఉంటే ఆమె ప్రతిరోజు వాకిళ్లు ఉడ్చి, ముగ్గు పెట్టమని చెప్పాలన్నారు. ఊరు వేళ్తున్న విషయాన్ని మీకు నమ్మకమైన వ్యక్తులకు మాత్రమే చేప్పాలన్నారు. వాహనాలను ఇంటి ముందు, రోడ్లపైన కాకుండా ఇంటి ప్రాంగణంలోని పార్కు చేసుకొవాలన్నారు. మీ కాలనీలో అనుమానిత వ్యక్తులు సంచరించినట్లయితే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని, లేదా స్థానిక పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పాండు, ఎఎస్ఐ అంజయ్య, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మైనార్టీ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ ఎం.డి. ఖాజా బక్ష్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రుద్రంపూర్ లో శుక్రవారం ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ని కాంగ్రెస్ మైనార్టీ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ ఎం.డి. ఖాజా బక్ష్ మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్ ,శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎం.డి. రజాక్ కూడా ఖాజా బక్ష్ ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## రాజపేట కుమ్మర సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట పట్టణ కుమ్మర సంఘం కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు నడికుడి జయంతి రావు, ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయాకర్ రావు, ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు ఓరుగంటి గోపాల్, ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ బోనాల వెంకటేశం, కోకో కన్వీనర్ తౌటి కృష్ణమూర్తి, కల్లూరి వెంకటేశం, ఇంద్రపాల ఆంజనేయులు, నాగపురి పుల్లయ్య, చల్మలపల్లి లక్ష్మణ్ లు పాల్గొని రాజపేట పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. రాజపేట పట్టణ అధ్యక్షులుగా చలమల్లపల్లి నాగరాజు,ప్రధాన కార్యదర్శి నాగపురి ప్రవీణ్, కోశాధికారి పారేల్లి శ్రీనివాసులు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కాళేశ్వరంతో పోలిస్తే మూడో వంతు ఖర్చు.. కానీ పదో వంతుకూ నీళ్లు ఇవ్వరట: హరీశ్‌రావు



హైదరాబాద్: తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ఖర్చు రూ.35 వేల కోట్లు అట అని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ‘‘ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుతో 4.47 లక్షల ఎకరాలకే సాగునీరట. ఇందులో నీటి వినియోగం 80 టీఎంసీలు మాత్రమేనట. కాళేశ్వరంతో పోలిస్తే మూడో వంతు ఖర్చు చేస్తూ.. పదో వంతుకూ నీళ్లు ఇవ్వరట. రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి 4.47 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలనేది అద్భుతం. కాంగ్రెస్ ప్రభుత్వ ఇంజినీరింగ్ నైపుణ్యానికి ఇది మరో మచ్చుతునక. ఇది కదా అసలైన మార్పంటే?’’ అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.



## స్టార్టప్‌లు, స్కేల్‌అప్‌లు తమ కథలను ప్రపంచానికి చెప్పేందుకు పిచ్2ప్రెస్ వేదికను వినియోగించుకోవాలి

*** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : స్టార్టప్‌లు, స్కేల్‌అప్‌లు తమ కథలను ప్రపంచానికి చెప్పేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఈ నెల 27న హైదరాబాదులోని ట్రైడెంట్ హోటల్‌లో జరుగనున్న పిచ్ 2ప్రెస్’ పోస్టర్‌ను ఆయన ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాల తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే తొలిసారిగా జర్నలిస్టుల ముందు నేరుగా ఇన్నోవేటర్లు తమ అనుభవాలను చెప్పుకునే అవకాశం ఇది అన్నారు. స్టార్టప్‌లు ఎక్కువగా ఇన్వెస్టర్లకే ఫోకస్ చేస్తుంటారు. కానీ మీ అనుభవాలను ప్రపంచానికి చెబితేనే నిజమైన గుర్తింపు వస్తుందన్నారు. పత్రిక లేదా టీవీ కథనాలు మీ వ్యాపారాన్ని ఊహించని స్థాయికి తీసుకెళ్లగలదు. అందుకే స్టార్టప్‌లు, స్కేల్‌అప్స్ తప్పక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి” అని అన్నారు. ఈవెంట్‌లో పాల్గొనాలనుకునే స్టార్టప్‌లు/ ఇన్నోవేటర్లు tinyurl.com/pitch2press ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు లేదా +91 80190 77575 నంబర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.



## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**- యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్**

అందోలు, ప్రజాస్ఫూర్తి: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం జోగిపేటలోని తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను, కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేండ్లు రేషన్‌కార్డులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ప్రజల సమస్యలను అర్థంచేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులను అర్హులైన వారందరికి అందిస్తుందన్నారు.బీఆర్ఎస్ పాలనలో పదేండ్లుగా నోచుకోలేని రేషన్‌కార్డులను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలను నేరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. తెల్లరేషన్ కార్డు కోసం ధరఖాస్తు చేసుకున్న వారిలో 1121 మంది లబ్దిదారులకు తెల్లరేషన్‌కార్డులను అందించామన్నారు. వచ్చే నెల నుంచి రేషన్ ద్వారా సరుకులను పొందవచ్చునని ఆయన తెలిపారు. ఆదే విధంగా కల్యాణలక్ష్మి పథకం కింద 19 మందికి, షాదిముబారక్ పథకం కింద 03, మొత్తం 22 మంది లబ్దిదారులకు రూ.22.02 లక్షల విలువైన చెక్కులను అందజేశామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను కొనసాగిస్తుందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ హయాంలోనే అందోలు నియోజకవర్గంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో పాండు, తహశీల్దార్ మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎఎంసీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి,మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, రాములు, మాజీ ఎంపీటీసీ బాలయ్య, యువ నాయకులు రమేష్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

*** డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన డివైఎఫ్ఐ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరన్నర గడిచినా రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలు కాలేదని విమర్శించారు. ఇప్పటివరకు కేవలం 60 వేల పోస్టులు మాత్రమే భర్తీ చేయగా, మిగిలిన హామీలను నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీపీఎస్సీ నోటిఫికేషన్ల విడుదల, పరీక్షల నిర్వహణలో ఘోర వైఫల్యం పాలయ్యిందని రమేష్ అన్నారు. గ్రూప్-1 పరీక్షను పలుమార్లు వాయిదా వేయడం వల్ల నిరుద్యోగులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. టీజీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా ఉద్యోగాల కల్పనలో విఫలమై, మతతత్వం వైపు యువతను నడిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల నిరుద్యోగుల సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మంచి కంటి భవన్ నుండి అమరవీరుల స్థూపం వరకు డ్రగ్స్, గంజాయి వ్యతిరేక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాలంగి హరికృష్ణ, నాయకులు మధు, విజయ్, అమల, వీరబాబు, జగన్, సంతోష్, రఘు, శశి, సింధుజా తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడి టీచర్ లను అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదు

*** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కాని లక్ష్మణ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అంగన్ వాడి టీచర్ లను అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కాని లక్ష్మణ్ అన్నారు. అంగన్ వాడి టీచర్ల ఆయాల సమస్యలను పరిష్కరించాలని అంగన్ వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వటం కోసం రాష్ట్ర నాయకులు ప్రజా భవన్ కు వెళ్లే కార్యక్రమం పెట్టుకుంటే కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్లను ఆయాలను ఉదయం 5:30 కి ఇండ్ల దగ్గరికి వెళ్లి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. టీచర్లు ఉదయం 9 గంటలకు పిల్లలు వస్తారు సెంటర్లను ఓపెన్ చేయాలి అని చెప్పినా వినకుండా మాకు పైనుంచి ఆర్డర్స్ వచ్చాయి మిమ్ములను ఇప్పుడు పంపించేది లేదంటూ చెప్పడం జరిగిందన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాల కొరకు పోరాడుతున్న అంగన్ వాడి టీచర్ లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. వేతనాలు పెంచాలని అడిగితే ఉద్యోగ భద్రత ఉండాలి అని అడిగితే మహిళలని కూడా చూడకుండా అక్రమంగా అరెస్టులు చేయడం భయభ్రాంతులకు గురి చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు.

## మంతపురి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

*** పట్టుబట్టలు” యాటను, అందజేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. కొర్టూరి లక్ష్మి అశోక్ లబ్ధిదారుల యొక్క ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం చేసి వారికి ఇచ్చిన మాట ప్రకారం పట్టు బట్టలు యటాను అందజేశారు.ఈ దసరా పండుగలోపు ప్రతి గ్రామంలో త్వరితగతిన ఇల్లు నిర్మాణం చేసి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు.

## సాయి గూడెం గ్రామంలో స్వచ్ఛభారత్



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా బిజెపి పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవ పక్షంలో భాగంగా శుక్రవారం సాయి గూడెం గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ భారత్ తో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలని అన్నారు. సెప్టెంబర్ 17 ప్రధాని మోదీ జన్మదినం నుండి 15 రోజులపాటు ఈ సేవా కార్యక్రమాలు చేనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శేషత్వ అమరేందర్, కార్యదర్శులు బైరి మహేందర్ ,కట్టా అమరేందర్ రెడ్డి, మండల కోశాధికారి కుండే గణేష్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు అర్చన, నాయకులు చింత కింది శ్రీధర్ , భీమ గాని సంపత్ ,జి. శివకృష్ణ, గడ్డమీద సందీప్, కిషోర్, జి పరశురాములు శివ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలి

* **భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటం రాజు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మోదీ సర్కార్ లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటం రాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం గట్టు శ్రీరాములు ఫంక్షన్ హాల్ లో యాదాద్రి భువనగిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ మహాసభలు శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ కేంద్రంలోని చిన్న కొండూరు రోడ్డులో గల భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభ నిర్వహించుకున్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటం రాజు పాల్గొని మాట్లాడుతూ సిఐటియు సహకారంతో దశాబ్దాల పోరాటాల ఫలితంగా 1996లో భవన నిర్మాణ కార్మిక చట్టం ఏర్పడిందన్నారు. ఐక్యత పోరాటాల పట్టిమ వల్లే దేశవ్యాప్తంగా వెల్ఫేర్ బోర్డు తద్వారా సంక్షేమ పథకాలను సాధించుకోగలిగామన్నారు. వెల్ఫేర్ బోర్డు సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్ ల పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. లేబర్ కోడ్ రద్దుకు భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులను ఐక్యం చేసి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.





పని సమయాలలో కార్మికులు మరణించిన, సహజ అంగవైకల్యం జరిగితే సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం కార్మికులకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణంలో వాడే ముడి సరుకుల ధరలు భారీగా పెరగడంతో మధ్యతరగతి ప్రజలు, చిన్నస్థాయి బిల్డర్లు నిర్మాణాలు చేపట్టడమే మానేశారన్నారు. దీంతో నిర్మాణరంగా కార్మికులు పనులు కోల్పోయి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. తద్వారా భవన నిర్మాణరంగం సంక్షోభంలోకి నెట్టబడుతుందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ క్లైమూలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 55సంవత్సరాలు దాటిన కార్మికులకు రూ.9వేల పెన్షన్ ఇవ్వాలని, పనిముట్లు కొనుగోలుకు ఆర్థిక సహాయం, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, అడ్డాల నిర్మాణం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలులో అవినీతిని అరికట్టాలని, జిల్లా వ్యాప్తంగా కార్మికులను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. గత పోరాటాలను సమీక్షించి, భవిష్యత్ కర్తవ్యాలను నిర్వహించేందుకు ఈ మహాసభలు ఉపయోగపడ్డాయన్నారు. ఈ మహాసభలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిగే స్వాములు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి పాషా, ప్రజా నాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షుడు గోశిక కరుణాకర్, సిఐటియు జిల్లా నాయకులు ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కూరెళ్ళ నరసింహ, చీమకండ్ల శ్రీరాములు, గుణముని రాములు, కల్వకుంట్ల శివ, కోట సంధ్యారాణి, ఆర్ మల్లేశం, రామచంద్రం, గాదె కృష్ణ, మారయ్య, జహంగీర్, నెలికంటి నరసింహ, సైదులు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో
# ట్రాంజెండర్స్ కీ కౌన్సిలింగ్



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాంజెండర్స్ కీ శుక్రవారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఏవైనా గృహప్రవేశాల సందర్భంగా ప్రజలను ఇబ్బంది పెట్టద్దని ఒకవేళ ఎవరినైనా బలవంతంగా ఇబ్బంది పెట్టి డబ్బులు వసూలు చేస్తే వారిపై కేసు నమోదు చేయబడుతుందని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

# 21 నుండి రెజ్లింగ్ శిక్షణ శిబిరం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమేచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుండి 10 రోజులపాటు కొత్తగూడెం 3 ఇంక్లైన్ లోనీ తెలంగాణ క్రీడా మైదానం లో రెజ్లింగ్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ నెల నుండి ప్రారంభం కానున్న స్కూల్ గేమ్స్, సీఎం కప్, అసోసియేషన్ లు నిర్వహించే రెజ్లింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు పాల్గొని సత్తా చాటి పతకాలు గెలుపొందేందుకు గాను ఈ 10 రోజులపాటు రెజ్లింగ్ లొ ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కాశీ హుస్సేన్ వివరించారు. ఉదయం, సాయంత్రం ,కూడా నిర్వహించనున్న ఈ శిబిరాన్ని జిల్లాలోని బాల,బాలికలు యువతీ ,యువకులు సద్వినియోగం చేసుకోవాలని కాశీ హుస్సేన్ కోరారు.వివరాలకు పి కాశీ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెల్ 9949761181 నో సంప్రదించాల్సిందిగా కోరారు.

# ఇల్లందు డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి , భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఇల్లందు డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించారు.సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ, సబ్ డివిజన్‌లో నేరాలు జరుగకుండా ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాల బారిన ప్రజలు పడకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతర అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు అండగా నిలిచి, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచేలా బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు.తరువాత ఎస్పీ కార్యాలయ ఆవరణను పరిశీలించి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పీ చంద్రభాను, సీఐలు సురేష్, సత్యనారాయణతో పాటు సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంద్ర పాల ముత్యాలమ్మ దేవస్థాన నిర్మాణముకు సమావేశం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 10వ వార్డులో అనాదిగా పూజలు అందుకుంటున్న ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లికి నూతనంగా దేవస్థాన నిర్మాణానికి సంబంధించి పలు కుల సంఘాలు దేవస్థానం ఆవరణలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కుమ్మరులు దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ 100సంవత్సరాల చరిత్ర ఉన్న ఈశాన్య ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లికి ప్రతి సంవత్సరం ఘనంగా అన్ని కులాల వారు పెద్ద సంఖ్యలో భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతున్న సందర్భంగా గ్రామ దేవతలను కొలుచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. దీనిలో భాగంగా గుడి నిర్మాణం కు త్వరలో కమిటీని ఏర్పాటు చేసుకొని గుడి నిర్మాణానికి పూనుకుంటామని తెలిపారు. విజయదశమి సందర్భంగా దేవస్థానం ఆవరణలో సెప్టెంబర్ 22వ తేదీన శ్రీ దుర్గా మాత విగ్రహ ప్రతిష్ట నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. దీనికిగాను త్వరలో ఉత్సాహ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అక్టోబర్ 2వ తేదీన ఘనంగా దసరా ఉత్సవం ను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, కావున ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో పలు కుల సంఘాల పెద్దలు చింతకింది అంజయ్య గౌడ్, ముత్యాల భూపాల్ రెడ్డి, ఎరుకల భీమయ్య గౌడ్, ఎర్రసాని సతీష్ యాదవ్, ఎరుకల నరేష్ గౌడ్, చింతకింది శేఖర్ గౌడ్, ఊడుగు మల్లేష్ గౌడ్, పల్సం ఉత్తరయ్య ముదిరాజ్, మలిగె వెంకటేశం, పాశం రామాంజనేయులు ముదిరాజ్, పాలకుర్ల స్వామి గౌడ్, ముత్యాల మోహన్ రెడ్డి, చింతల మధుసూదన్ రెడ్డి, ఊడుగు వెంకటేశం గౌడ్, ఎల్లంకి పాండుగౌడ్, ఎరుకల మల్లేష్ గౌడ్, తొర్పునూరి మల్లేష్ గౌడ్, చెరుకు శివ గౌడ్, మారుపాక నాగరాజు, మారుపాక నరేష్, పల్సం సత్యం, లోకమోని మల్లేష్, సురిగి రాములు, భరత్ కుమార్, నరసింహ చారి, అనంతుల నరసింహ, ఎరుకల రాములు, రాజపేట శ్రీశైలం, ఎరుకల వెంకటేశం, మహిళలు ఆవుల అండాలు, బాలమణి, మారుపాక యాదమ్మ, కేతమ్మ, శాలివాహన సంఘం అధ్యక్షుడు సిలువేరు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# మోటకొండూరు ప్రెస్ క్లబ్ ని ప్రారంభించిన
## ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే

ఆలేరు, ప్రజా స్ఫూర్తి: ప్రజలకు ప్రభుత్వానికి వారధి పత్రికలేనని, నిజాయితీగా నిర్భయంతో విలేకరులు పనిచేసి సమాజంలోని కుల్లు కుతంత్రాలను వెలికి తీయాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలో నూతన మోటకొండూర్ ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విలేకరుల సంక్షేమం కోసం పాటు పడుతుందని అన్నారు. మారుమూల గ్రామాల నుండి మండల కేంద్రం వరకు జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలికి తీసి పరిష్కరించడంలో పార్టీలకతీతంగా కృషి చేయాలని అన్నారు. మోటకొండూర్ లో విలేకరులకు కేటాయించిన ప్లాట్ల సమస్య త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చామల మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు షేక్ ఉస్మాన్, ప్రదాన కార్యదర్శి గుర్రాల నాగరాజు, జాయింట్




సెక్రటరి సూదగాని నవీన్ గౌడ్, సహాయ కార్యదర్శులు కోల పరుషరాములు, పుల్లె నరేష్ యాదవ్, కోషాదికారి కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గట్టికొప్పుల శ్రీనివాస్, వివిద శాఖల అధికారులు, వివిద పార్టీల నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలేరు మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ప్రభుత్వ విప్



ఆలేరు ప్రజా స్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం పలు గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటించారు. మండలంలోని మంతపురి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం చేసి, సీసీ రోడ్డు ను ప్రారంభించారు. పటేల్ గూడెం గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభించి, సాయి గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి పలు సమస్యలపై చర్చించడం జరిగింది, అనంతరం సారాజుపేట చెరువు అలుగున పరిశీలించి చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది, ఆ తర్వాత తూర్పు గూడెం గ్రామంలో సిసి రోడ్డు, పీర్ల కొట్టాన్ని ప్రారంభించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి మరియు మండల జిల్లా నాయకులు అధికారులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు గ్రామస్తులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# విలువలతో కూడిన విద్యతో.. భవిష్యత్ ఉజ్వలం

* **లయన్స్ క్లబ్ కోశాధికారి చిలువేరు మంగయ్య సహకారంతో విద్యార్థులకు టై, బెల్టులు**
* **చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: క్రమశిక్షణ, పట్టుదలతో పాటు విలువలతో కూడిన విద్యను అభ్యసించడంతో భవిష్యత్తు ఉజ్వలంగా వెలుగొందుతుందని చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ కోశాధికారి చిలువేరు మంగయ్య దాతృత్వంతో శుక్రవారం విద్యార్థులకు టైలు, బెల్టులు ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించాలని మరియు నేటి బాలలే రేపటి పౌరులని నవ సమాజ స్థాపనకు చేయూతనియాలని అన్నారు. అనంతరం దాత సిలివేరు మంగయ్యను ప్రత్యేకంగా అభినందించారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గురువారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరందాజ్ జగన్, మాజీ సర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కోమటిరెడ్డి నరసింహారెడ్డి, మహమ్మద్ పాషా, వెంకటేశం, వేముల నరసింహ, బోల్లోజు రాజు చారి, చింతల ప్రభాకర్ రెడ్డి, సిలివేరు శివ తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి కేటీఆర్ ను కలిసిన రాజపేట టిఆర్ఎస్ నాయకులు

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల జలసాధన సమితి, టిఆర్ఎస్ నాయకులు శుక్రవారం టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీమంత్రి కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా హైదరాబాదులో కలిశారు. రాజపేటకు నది జాలాల సాధన గురించి ఈ సందర్భంగా ఆయనకు జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్ గుర్తు చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రాజపేటకు కాల్వల ద్వారా నీటిని సాధించే విషయంపై చర్చిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి తెలిపారు. చలిమిడి వెంకటేశం తదితరులు ఉన్నారు.

# విష్ణు కుమార్ పంచార్య మృతి

* **పతంజలి సేవా కేంద్రం నిర్వాహకుడి మృతి**
* **ఘననివాళులు అర్పించిన మార్వాడి సమాజం.**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలోని పతంజలి ఆరోగ్య సేవా కేంద్రం నిర్వాహకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దివంగత జుగల్ కిషోర్ పంచార్య పెద్ద కుమారుడు విష్ణు కుమార్ పంచార్య గురువారం రాత్రి అకాల మృత్యువుకు గురి కావడంతో మార్వాడి సమాజం కన్నీరు మున్నీరుగా విలపించింది. మార్వాడి సమాజంలోని పెద్దలు శుక్రవారం విష్ణు కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆయుర్వేద వైద్య సేవలను కొనియాడారు. నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్న వారిలో విష్ణుకుమార్ సోదరులుఅశోక్ కుమార్ పంచార్య, మార్వాడి సత్రం మేనేజర్ గోపాల్ పంచార్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా విశ్రాంత రవాణా అధికారి ధనరాజ్ బజాజ్, అశోక్ రాటి, వల్లభ దాస్ దామోదర్ దాస్ అటాస్నియా, దుర్గ శంకర్ జాజు, శంకర్, ప్రకృతి ఆశ్రమం కోఆర్డినేటర్ సుగుణారావు, ప్రముఖ సంఘ సేవకులు లగడపాటి రమేష్ చంద్, నరేంద్ర కుమార్ సోనీ, విమల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు

# ఆటో కార్మికులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే

* కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
* కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో, రవాణారంగ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య నేతృత్వంలో చుంచుపల్లి మండలం బైపాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఆటో కార్మికులు చేపట్టిన పాదయాత్రకు సిపిఐ రాష్ట్ర ఆపార్టీ పక్షాన సంఘీభావం తెలిపిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలోని మహిళలు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని స్వాగతిస్తున్నామని అయితే ఈ పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సంక్షేమ పథకాల్లో కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఈఎస్ఐ, భీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. సబ్సిడీతో కూడిన రుణాలను ఆటోల కొనుగోలుకు అందించాలని కోరారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం



అందించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గనిగిళ్ళ వీరస్వామి, వాసిరెడ్డి మురళి, నాయకులు వేల్పుల మల్లికార్జున్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బత్తుల సత్యనారాయణ, మర్రి కృష్ణ, ఆరేల్లి కృష్ణ, అబ్బులు, భాష, చింటూ, ముక్కెర లక్ష్మణ్, జోసఫ్, అమిత్, మంద శీను, బడుగు భాస్కర్, మాజీ కౌన్సిలర్స్ ధర్మరాజు, ఈసుబు, బోయిన విజయకుమార్ సిపిఐ నాయకులు మండల రాజేశ్వరరావు, మూడెత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛభారత



యాదగిరిగుట్ట ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్వచ్ఛభారత్ నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి ఇక్కడికి వచ్చేటువంటి రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు టాయిలెట్లు కూడా నిరుపయోగంగా ఉన్నాయి పేరుకు ఈ యాదగిరిగుట్ట కానీ 24 గంటలు అందుబాటులో ఉండే డాక్టర్ ఇక్కడ లేదు సాయంత్రం అయితే పట్టణంలో ఏ ఒక్కరికి జ్వరం వచ్చిన భువనగిరి వెళ్లాల్సిన పరిస్థితి కావున తక్షణం ఇక్కడ అందుబా 24 గంటలు అందుబాటులో ఉండే డాక్టర్లను ఏర్పాటు చేసి బెడ్ల సంఖ్యను పెంచాలి ఈ యొక్క హాస్పిటల్ పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ ,పట్టణ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి , ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్ ,కార్యదర్శిలు దొమ్మాట ప్రభాకర్ ,ఆవుల సత్యనారాయణ ,ఆలేటి కర్ణ ,పాలుగుల సురేష్ ,సీనియర్ నాయకులు లింకలపల్లి శ్రీనివాస్ ,భువనగిరి శ్యాంసుందర్, బెలిదే అశోక్ ,సుడుగురాజు రెడ్డి, బుగ్గ శ్రీకాంత్, బోడ బుచ్చిబాబు ,కోల నరసింహ ,అజయ్ ,అనిల్ ,మెరుగు వెంకటేష్ ,చిన్న, శ్రావణ్ ,సంద ప్రవీణ్ ,నరేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతతో పెట్టుకుంటే మనుగడ ఉండదు

* మల్లపురం తాజా మాజీ ఉప సర్పంచ్-పల్లెపాటి మాధవులు



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో విలేకరుల ఈ సమావేశంలో మల్లాపురం గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ పల్లెపాటి మాధవులు గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో సరూర్ నగర్ లో యూత్ డిక్లరేషన్ క్రింద ఇచ్చిన హామీ రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా నిరుద్యోగ రెండు లక్షల ఉద్యోగాలు మరియు యువతకు 4 లక్షల వరకు బ్యాంక్ రుణాలు ఇస్తామని చెప్పి యువతతో ఓట్లు వేయించుకొని రెండు సంవత్సరాలు గడుస్తున్నా యువతకు ఎలాంటి రుణాలు ఇవ్వకుండా మరియు ఉద్యోగ కల్పనకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా కాలయాపన చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు ఈ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించే బాధ్యత ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉంది అని కాలయాపన చేస్తే రాబోయే రోజులలో యువత పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతారని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు గౌడ శ్రీశైలం కర్రె చంద్రశేఖర్, కారింగుల కిష్టయ్య,ఇండ్ల ప్రసాద్, మోటే శేఖర్, ఓరిగంటి శ్రీధర్ ఆచారి, పల్లెపాటి నాగరాజు, కొండం శ్రీకాంత్, కోమారాజు భరత్, కర్రె చింటూ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం బారులు.. రైతుల మధ్య తోపులాట



కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లిలో యూరియా కోసం వేలసంఖ్యలో రైతులు బారులు తీరారు. ఐదు రోజులుగా యూరియా సరఫరా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. లారీ లోడు యూరియా వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా రైతులకు అధికారులు కూపన్లు ఇచ్చే ప్రక్రియ చేపట్టారు. దీంతో కారేపల్లి మండలంలోని 41 పంచాయతీల నుంచి 3వేలకు పైగా రైతులు కూపన్ల కోసం క్యూలైన్లలో నిలుచున్నారు. ఈ క్రమంలో పలుమార్లు తోపులాట చోటుచేసుకుంది. రైతులకు సర్దిచెప్పేందుకు పోలీసులు ఇబ్బందులు పడ్డారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పరిశీలన

- మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్ లో బతుకమ్మ వేడుకలు
- జెడ్పీ సీఈవో శోభారాణి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలను జెడ్పీ సీఈఓ శోభారాణి శుక్రవారం పరిశీలించారు. నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. లబ్ధిదారులకు బిల్లులు పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్ ను సందర్శించారు. విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం రాత్రి హాస్టల్ లోనే నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ



సందీప్, ఎంపీవో అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో సౌకర్యాలు మెరుగుపడాలి

- ఎమ్మెల్యే కూనంనేని

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు సౌకర్యాలు సమకూర్చి, ప్రైవేటు విద్యకు ధీటుగా నిలబెట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.శుక్రవారం కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.3.92 కోట్ల టిజిబిఐఈ నిధులతో నిర్మించనున్న నూతన భవన సముదాయానికి, రూ.58 లక్షల మరమ్మత్తు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని తెలిపారు. పేద విద్యార్థులు అసౌకర్యాల కారణంగా విద్యకు దూరం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.కొత్తగూడెం జూనియర్ కళాశాల అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దిందని, ఈ విద్యాసంస్థ మరింత అభివృద్ధి చెందేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. సుజాతనగర్ జూనియర్ కళాశాల మంజూరు, మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ, రామచంద్ర డిగ్రీ కళాశాల, పాల్వంచ జూనియర్ కళాశాల, తెలంగాణ పాఠశాలల్లో



ఇప్పటికే అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. పనులను నాణ్యతతో చేపట్టి, త్వరగా పూర్తి చేసి విద్యార్థుల సౌకర్యార్థం అందుబాటులోకి తేవాలని అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, ఆర్డీవో మధు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ కత్తి రమేష్, ఇ.ఇ. కె. బుగ్గయ్య, డీఈ నాగేశ్వరాచారి, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, తహసీల్దార్ పుల్లయ్య, పంచాయతీరాజ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పుతో 25 లక్షల మంది టీచర్లపై ప్రభావం

* టెట్ పరీక్ష ఉత్తీర్ణతపై మినహాయింపు ఇవ్వాలి..
* పిఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య



అందోలు, ప్రజాస్ఫూర్తి: ఉద్యోగ విరమణకు ఐదేళ్లకు మించి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్లలో తప్పనిసరిగా (టెట్) ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని, లేని పక్షంలో ఉద్యోగం నుంచి రిటైర్ కావాలని ఈ నెల 1వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో 25 లక్షల మంది టీచర్లపై ప్రభావం పడనుందని పిఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎ.మాణయ్య అన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలన్న దానిపై మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన జోగిపేటలో పత్రిక ప్రకటనను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని, రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసి ఉపాధ్యాయులకు అండగా నిలువాలని ఆయన కోరారు. ఈ తీర్పు వల్ల 2010కి ముందు దేశవ్యాప్తంగా నియామకమైన 25 లక్షల మంది టీచర్లపై ప్రభావం చూపుతుందన్నారు. 20 నుంచి 25 సంవత్సరాల సర్వీస్‌ను పూర్తిచేసిన ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు సుప్రీం తీర్పుపై ప్రభుత్వం రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేయాలన్నారు. ఆగష్టు 2010 తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ ను తప్పనిసరి చేస్తూ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23లో స్పష్టత ఇచ్చే విధంగా చట్టాన్ని సవరించాలన్నారు. గత 15 సంవత్సరాలుగా ఎన్సీటిఈ, మరియు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా హక్కు చట్టం అమలుకు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అవసరమని చెప్పలేదన్నారు. 2010 కి ముందు నియామకమైన వారికి టెట్ మినహాయింపు ఇచ్చినట్లు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయని అందుకే సీనియర్ టీచర్లు ఇప్పటివరకు టెట్ పాస్ కావాలనే ఆలోచన చేయలేదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు వచ్చేలా చూడాలని కోరారు.

## జీవితంపై విరక్తి తో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ముస్తాబాద్ మండలం మద్దికుంట గ్రామానికి చెందిన కదిరే హరీష్ (29) పరుగుల మందు సేవించి శుక్రవారం ఆత్మహత్యకు చేసుకున్నాడని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా మద్యంకు అలవాటు పడిన హరీష్ రోజూ తాగి వస్తూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడని, అతని ప్రవర్తనతో తన భార్య కూడా పుట్టింటికి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి హరీష్ మరింత మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. ఈ క్రమంలో 18న సాయంత్రం పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి పొలం వద్దకు వెళ్లి పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. ఈ మేరకు మృతుని తండ్రి కదిరే నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని, విచారణ ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు.

## మొన్న మనిషి.. నిన్న ఆవు.. నేడు ఎవరు..?

* టిప్పర్ల అతివేగంతో పెరుగుతున్న ప్రమాదాలు
* ప్రజాస్ఫూర్తిలో వరుస కథనాలు
* రామవరం 14 నెంబర్ దగ్గర ఆవు నీ ఢీ కొట్టిన టిప్పర్....
* ఆవులు రోడ్లమీద కనిపిస్తే యజమానులకు కఠిన చర్యలు తప్పవు - టూ టౌన్ సీఐ ప్రతాప్

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: టిప్పర్ల అతివేగంతో ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతుంది. టిప్పర్ ఢీకొని మొన్న మనిషి ప్రాణం విడిచిపెట్టగా... నిన్న ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదే పరిస్థితులు కొనసాగితే రేపు ఏ ఆటోనో... కారునో టిప్పర్లు ఢీకొట్టి అందులో ఉన్న వారి ప్రాణాలను హరిస్తాయేమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంకటేశ్ఖని ఓపెన్‌కాస్టు పనుల్లో భాగంగా వెలికి తీసిన మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే కొందరు టిప్పర్ డ్రైవర్లు జాతీయ





రహదారిపై అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. రవాణా, పోలీస్ శాఖల అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే టిప్పర్ డ్రైవర్లు తమ ఇష్టారీతిన వాహనాలు నడుపుతున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. కొందరు అనుభవం లేని డ్రైవర్లు టిప్పర్లు తోలడం వల్ల, మరికొందరు మద్యం సేవించి నడపడం, క్లీనర్ల చేతికి వాహనాలు ఇవ్వడంతోనే ఇలాంటి వరుస సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు అంటున్నారు. గత మంగళవారం రాత్రి ఓ టిప్పర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మరువక ముందే తాజాగా శుక్రవారం రామవరంలోని 14వ నెంబర్ బస్తీ వద్ద రోడ్డు పక్కన ఉన్న ఆవును టిప్పర్ అతివేంగా వచ్చి ఢీకొట్టడంతో దానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టూటౌన్ సీఐ డి.ప్రతాప్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఒకవైపు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులు ఈ ప్రమాదానికి ఒక కారణమైతే... మితిమీరిన వేగంతో టిప్పర్లు నడపడం మరో కారణంగా చెప్పవచ్చు. అయితే రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులతో చర్చించి, వాటిని రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటామని సీఐ డి.ప్రతాప్ తెలిపారు. భవిష్యత్తులో రోడ్లపైకి పశువులు వస్తే వాటి యజమానులకు జరిమానా విధించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఇదేవిధంగా టిప్పర్ డ్రైవర్లపై కూడా చర్యలు తీసుకోవాలని, వారికి అవగాహన సదస్సులు నిర్వహించడం, డ్రైవింగ్ టెస్ట్‌లు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ప్రతినిత్యం నిర్వహించాలని కూడా పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ఆటో కార్మికులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే

* **ఘనంగా వరల్డ్ ఫోటోగ్రఫీ డే వేడుకలు**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం అసోసియేషన్ సభ్యులు అందరూ కలిసి స్నేహపూర్వక వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్‌ను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. టోర్నమెంట్‌లో అసోసియేషన్‌కు చెందిన అనేకమంది సభ్యులు జట్లు ఏర్పరచుకుని ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫోటోగ్రఫీ వృత్తిలో బిజీగా ఉండే సభ్యులు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం పొందడం, సభ్యుల మధ్య ఐక్యత




పెంపొందించడం లక్ష్యంగా ఈ టోర్నమెంట్‌ను అసోసియేషన్ నిర్వహించింది. శుక్రవారం భోగారంలోని పీజీఆర్ గ్రౌండ్ లో నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తూ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ మన అసోసియేషన్ ప్రతి సంవత్సరం ఇలాంటి పోటీలను నిర్వహించుకుంటూ సభ్యుల శారీరక దృఢత్వం, స్నేహబంధం పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది అని అన్నారు. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం అసోసియేషన్ సభ్యులు రాజు, నరేష్, శివనారాయన, కన్నా, రమణ శ్రీ, ప్రకాష్, దాస్, సాయికుమార్ గౌడ్, ఆర్ టీ రమేష్, దేవేందర్ రెడ్డి, రవికుమార్ గౌడ్, యాదిరెడ్డి, శ్రీనివాస్, హరి, రవి, మోహన్, యాకయ్య, సత్యం, రాము గౌడ్, గౌస్, శంకర్, సంతోష్, గణేష్, మధు గౌడ్, శేఖర్ గౌడ్, మురళి, పరమేష్, మధు, హనుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నరు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఫోటోగ్రాఫర్లు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రధాని నరేంద్ర మోడీ, జన్మదినం సందర్భంగా"రక్తదాన శిబిరం"



ప్రజాస్ఫూర్తి ఇల్లందు: ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన "సేవా పక్షం" లో భాగంగా శుక్రవారం ఇల్లందు కేంద్రంలోని పెన్షనర్స్ భవన్ లో ఇల్లందు మండల అధ్యక్షులు భట్టు రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన "రక్తదాన శిబిరం" ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ రక్తదాన శిభిరంలో భారీ సంఖ్యలో నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొని 75 యూనిట్స్ ల పైగా రక్తదానం అందించడం జరిగింది. ఈ సందర్బంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పక్షం రోజులు జరిగే సేవాకార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛ్ భారత్, రక్తదాన శిబిరాలు, మారథాన్, దివ్యాంగులకు, మాజీ సైనికులకు,. ప్రభుత్వ పురస్కార గ్రహీతలను సన్మానించే కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సుచిత్ర పాసి, శ్రీకాంత్, జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్, మహిళా మోర్చా నాయకురాలు సునిత, రాష్ట్ర గిరిజన మోర్చా నాయకులు శ్రీను, నియోజకవర్గ ఇంచార్జి గోపిక్రిష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి రివెళ్ల నాగరాజు, బయ్యారం మండల అధ్యక్షులు శ్రీనివాస్, గార్ల మండల అధ్యక్షులు శివ కృష్ణ, యువ మోర్చా నాయకులు నర్సింహారెడ్డి రెడ్డి, రాహుల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నోవా కేర్ బ్లడ్ సెంటర్, ఖమ్మం వారిచే డా:రాజ్ కుమార్ యాదవ్, ఆధ్వర్యంలో జరుగుచున్నది.




## ఘనంగా సాహితీ జూనియర్ కళాశాల ప్రెషర్స్ డే వేడుకలు

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: క్రమశిక్షణలో కష్టపడి చదివి విద్యార్థులు ఉన్నత స్థాయి కి చేరుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సింగరేణి స్కూల్ ఉపాధ్యాయులు బొద్దుల శ్రీనివాసరావు, సినియర్ రచయిత, సామాజిక వేత్త చాగంటి కృష్ణమూర్తి లు సూచించారు. పట్టణంలోని సాహితి జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సెలఫోనును తయారుచేసింది, జ్ఞానాన్ని పెంచడానికి కాని, నేటియువత దాని అవసరాన్ని దుర్వినియోగం చేసుకుంటున్నారన్నారు. అలా కాకుండా మంచి మార్గంలో విద్యార్థులు నడవాలని తెల్పారు, సాహితి కళాశాల డైరెక్టర్ ఎం.సి. నాగిరెడ్డి, విద్యార్థులకు చదువుకు పేద, ధనిక అనే తేడా ఉండదు అని ఎవరు కష్టపడి చదివితే వారి సొంతం అవుతుందని తెల్పారు. అలాగే మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ అవార్డుతో పాటు నగదు పురస్కారం కూడా అందజేసారు ఈ కార్యక్రమంలో బీ. శ్రీనివాసరావు, చాంగటి కృష్ణమూర్తి, ఎంసీ. నాగిరెడ్డి దంపతులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొద్దుల శ్రీనివాస రావు ని , చాగంటి కృష్ణమూర్తి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుజ్జర్లపడి రాంబాబు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకుంఠ దామాలలో అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండాలి

* **నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి**



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వైకుంఠ దామాలలో అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యం జరగకూడదని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు వైకుంఠ దామాలను స్థానిక వైకుంఠ దామాల నిర్వాహకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కరెంటు స్థంబాలు, సరైన లైట్లు లేకపోవడం, స్నానాల గదులకు తలుపులు లేకపోవడం వంటి మౌలిక వసతులు సరిగ్గా లేకపోవడం నేరుగా గమనించారు. తుంగతుర్తి రవి వెంటనే ఈ సమస్యలను మున్సిపల్ కమిషనర్, డీ.ఈ, ఏ.ఈ, సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి, రెండు నెలలలోపు కార్పొరేషన్ పరిధిలోని అన్ని స్మశాన వాటికల్లో లైట్లు, వాటి నిర్వహన, తాగునీటి సదుపాయం వంటి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన అంతిమయాత్ర కల్పించాల్సిన బాధ్యత మనపై ఉంటుందని, అందుకోసం. తక్షణం స్పందించి అధికారులతో పరిశీలించి త్వరలో ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చిన మున్సిపల్ కమిషనర్ కు తుంగతుర్తి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారం లభించడకపోవడమే అసలైన లోటు.. టూరిజం ఫెయిర్‌లో మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు

ప్రపంచస్థాయి పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని వనరులు తెలంగాణలో ఉన్నాయని, అయితే తెలంగాణ పర్యాటకానికి అనుకున్న స్థాయిలో ప్రచారం లభించడకపోవడమే అసలైన లోటు అని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని, పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యంగా త్వరలోనే తెలంగాణలో అత్యున్నత స్థాయి టూరిజం కాన్‌క్లేవ్ ను నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) లో జరిగిన ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) 2025 ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇటీవల నూతన పర్యాటక విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. పర్యాటకం కేవలం వినోదం కాకుండా ఉపాధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త టూరిజం పాలసీ ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందన్నారు. వివిధ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకు రావాలనుకునే యువ పారిశ్రామికవేత్తలకు ఇది విస్తృతమైన అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు.



టూరిజం రంగంలో పెట్టుబడులు పెట్టాలని, వారికి పూర్తిగా మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి చెప్పారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, తెలంగాణలోనే త్వరలో ఒక ఉన్నత స్థాయి టూరిజం కాంక్లేవ్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం చర్చలకు, పెట్టుబడి ప్రణాళికలకు, వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తుందని వెల్లడించారు. మీరు మా రాష్ట్రాన్ని అన్వేషించే టప్పుడు, మా పర్యాటక అవకాశాలను ప్యాకేజ్ చేయటంలో భాగస్వాములు కావాలని, తెలంగాణకు బ్రాండ్ అంబాసడర్లుగా నిలవాలని టూరిజం, ట్రావెల్స్, హస్పిటాలిటీ ఎగ్జిబిటర్లు, ప్రతినిధులకు మంత్రి పిలుపునిచ్చారు.




## ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో 5 వేల సీట్లు భర్తీ చేయాల్సిందే.. ఎస్ఎఫ్ఐ డిమాండ్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలలో దాదాపు 5 వేల సీట్లను భర్తీ చేయాలని, ఏటీసీల పేరుతో సాంప్రదాయ కోర్సుల్లో ప్రవేశాలు నిలిపివేయడం సరికాదని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SFI) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎస్.వి.కె. నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 64 ప్రభుత్వ ఐటీఐలలో మొత్తం 4,884 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రికల్, వెల్డర్, టర్నర్, స్టెనోగ్రాఫీ, డ్రెస్ మేకింగ్, కోపా, సివిల్, ఎం.ఎం.వీ, మెకానిక్, వుడ్ వర్క్, డీజిల్ మెకానిక్ వంటి అనేక ట్రేడ్లలో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు నిలిపివేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.

* **ప్రైవేటు కాలేజీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు..**

ఏటీసీలను తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ చర్యతో విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇచ్చే సాంప్రదాయ ట్రేడ్లలో ప్రవేశాలను నిలిపివేయడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రజినీకాంత్, టి. నాగరాజు అన్నారు. డిమాండ్ ఉన్న కోర్సులకు కనీసం నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని వారు విమర్శించారు. ప్రభుత్వ ఐటీఐలలో సీట్లు భర్తీ చేయకుండా ప్రైవేట్ కళాశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఈ ట్రేడ్లలో ప్రవేశాలు ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## 'ఎల్లవేళలా అండగా ఉంటా'.. బాధితులకు మంత్రి కొండా సురేఖ భరోసా

స్టేట్ ఎండోమెంట్ శాఖ పరిధిలోని పలువురికి డెత్ గ్రాట్యూటీ సత్వరంగా ఇప్పించినందుకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖకి బాధిత కుటుంబీకులు ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సచివాలయంలోని తన పేషీలో 20 బాధిత కుటుంబాలకు రూ. కోటి ఐదు లక్షలు స్వయంగా ఇచ్చారు. విధి నిర్వహణలో చనిపోయిన ఆరుగురు ఎండోమెంటు ఉద్యోగుల కుటుంబాలకు, రిటైర్ అయిన ఉద్యోగులకు, ఉపనయనం బెనిఫిట్స్, ఎడ్యుకేషన్ లోన్ సంబంధిత సాయాలను అందజేశారు. అయితే, ఈ గ్రాట్యూటీ ప్రక్రియను వేగవంతం చేసి, తమకు గ్రాట్యూటీ ఫండ్ త్వరితగతిన వచ్చేందుకు సాయం చేసిన మంత్రి సురేఖకు బాధిత కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... ఎండోమెంటు ఉద్యోగులకు ఎటువంటి కష్టం



వచ్చినా తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల బాగోగులను మంత్రి సురేఖ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మంత్రితో తమ సమస్యలు చెప్పుకుంటూ వాపోయారు. డ్యూటీలో తమ భర్త చనిపోవడంతో తమ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని మంత్రి దృష్టికి పలువురు మహిళలు తీసుకొచ్చారు. అయితే, ఆర్థిక ఇబ్బంది ఉన్న మహిళలకు అండగా నిలిచేందుకు ఏదైనా మార్గాలను అన్వేషించి, తగు న్యాయం చేయాలని ఎండోమెంటు ఉన్నతాధికారులను ఆదేశించారు. మన దేవాదాయ శాఖ కోసం సేవలు అందిస్తున్న క్రమంలో మరణించిన వారి కుటుంబాలకు కేవలం గ్రాట్యూటీ ఇచ్చి సరిపెట్టొద్దని, ఎక్కడ... ఏ విధంగా సాధ్యమైనా మన బాధ్యతగా సాయం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. మంత్రి సురేఖ స్పందనకు బాధిత మహిళలు కన్నీరు పెడుతూ భావోద్వేగానికి గురయ్యారు. వారిని మంత్రి సురేఖ ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, వెంకటేశ్, రామకృష్ణరావు, పీఎస్ సోమరాజు, ఓఎస్డీ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బై పోల్‌లో కాంగ్రెస్‌కు సురుకు పెట్టాలె.. మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సురుకు పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇవాళ ఆయన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేపటి తెలంగాణ భవిష్యత్తును జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక డిసైడ్ చేస్తుందని కామెంట్ చేశారు. అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేసిన రేవంత్ సర్కార్‌కు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు. పొరపాటున కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన అవసరం తమకు లేదని ఆ పార్టీ నాయకులు భావిస్తారని అన్నారు. కారు కావాలో కాంగ్రెస్, బీజేపీ బేకారుగాళ్లు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. తెలంగాణ రక్షగా, గొంతుగా ఉన్న కేసీఆర్‌ను లేకుండా చేయాలన్నదే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఉమ్మడి లక్ష్యమని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్‌ను ఖతం చేస్తే కాంగ్రెస్‌ను ఈజీగా ఫుట్‌బాల్ ఆడుకోవచ్చని బీజేపీ భావిస్తుందని అన్నారు. రేవంత్ సర్కార్ చేసిన మోసంతో రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ సంతోషంగా లేదని గీతక్క, సీతక్క, సురేఖ అక్కలు మాత్రమే సంతోషంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచరే రేవంత్ ప్రభుత్వమని కేటీఆర్ విమర్శించారు. రాహుల్ గాంధీ 'ఓట్ చోర్' అంటున్న మోడీని, మోసగాడనే అదానీని రేవంత్ వెనుకేసుకొస్తున్నాడని ఎద్దేవా చేశారు.

# లాభాలకు బ్రేక్

**పడిపోయిన మార్కెట్లను ఆదుకున్న అదానీ షేర్లు!**

**స్టాక్ మార్కెట్లో లాభాల స్వీకరణ**

**మూడు రోజుల జోరుకు అడ్డుకట్ట**

**ఐటీ, బ్యాంకింగ్ రంగాల దిగ్గజాల్లో అమ్మకాల ఒత్తిడి**

**సెబి క్లీన్ చిట్‌తో అదానీ షేర్ల ర్యాలీ!**



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లలో వరుస మూడు రోజుల లాభాల జోరుకు శుక్రవారం అడ్డుకట్ట పడింది. ఐటీ, బ్యాంకింగ్ వంటి కీలక రంగాల దిగ్గజ షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. అయితే, అదానీ గ్రూప్ షేర్లలో అనూహ్యమైన ర్యాలీ చోటుచేసుకోవడం మార్కెట్లను భారీ పతనం నుంచి కాపాడింది. అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల విషయంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) క్లీన్ చిట్ ఇవ్వడం అదానీ షేర్లకు కలిసొచ్చింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 387.73 పాయింట్లు నష్టపోయి 82,626.23 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 96.55 పాయింట్లు తగ్గి 25,327.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే బలహీనంగా కదలాడిన సూచీలు, అమ్మకాల ఒత్తిడితో మరింత కిందకు పడిపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 82,485.92 పాయింట్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది.

ఒకవైపు మార్కెట్ మొత్తం డీలా పడినా, అదానీ గ్రూప్ స్టాక్స్ మాత్రం దుమ్మురేపాయి. అదానీ పవర్ షేరు ఏకంగా 13.42% ఎగబాకగా, అదానీ టోటల్ గ్యాస్ 7.55% లాభపడింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.25%, అదానీ పోర్ట్స్ 1.15% మేర వృద్ధిని నమోదు చేశాయి. నష్టపోయిన షేర్ల జాబితాలో హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ బ్యాంక్, టాటా మోటార్స్, ఐటీసీ వంటి దిగ్గజాలు ఉన్నాయి. మరోవైపు, అదానీ పోర్ట్స్‌తో పాటు ఎస్‌బీఐ, ఎన్టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే.. ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్, ఆటో, ఐటీ, ఎఫ్ఎంసీజీ సూచీలు నష్టపోయాయి. అయితే, స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు నిలకడగా ట్రేడ్ అయ్యాయి. ఇక డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ స్వల్పంగా బలపడి 88.10 వద్ద ముగిసింది. గత సెషన్‌లో ఇది 88.13 వద్ద ఉంది.

## ఫ్లిప్‌కార్ట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్స్..



**న్యూఢిల్లీ:** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇ-కామర్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తన 350 సీసీ శ్రేణి వాహనాలను ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయించనుంది. సెప్టెంబర్ 22 నుంచి ఈ విక్రయాలు ప్రారంభమవుతాయి. బెంగళూరు, గురుగ్రామ్, కోల్‌కతా, లఖ్‌నవూ, ముంబయి నగరాల్లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350, క్లాసిక్ 350, హంటర్ 350, క్లాసిక్ 350, మెటోర్ 350 మోటార్ సైకిళ్లను పై ఐదు నగరాల్లోని ఫ్లిప్‌కార్ట్ యూజర్లకు అందుబాటులోకి రానున్నాయి. డెలివరీ, విక్రయానంతర సేవలు రాయల్ ఎన్‌ఫీల్డ్ అధీకృత డీలర్ల ద్వారా కొనసాగుతాయని కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ 22 నుంచి తగ్గిన జీఎస్టీ ప్రయోజనాలతో ఈ మోటార్ సైకిళ్లు లభ్యమవుతాయని తెలిపింది. ఆయా బైక్స్‌పై ఇప్పటికే రూ.22 వేలు చొప్పున ధర తగ్గించిన సంగతి తెలిసిందే.

డిజిటల్ ఫస్ట్ కస్టమర్లకు కూడా చేరువయ్యేందుకు ఫ్లిప్‌కార్ట్‌తో జట్టుకట్టినట్లు ఐషర్ మోటార్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ బి గోవిందరాజన్ పేర్కొన్నారు. తొలుత ఐదు నగరాల్లో ఈ సేవలు అందించనున్నామని, తర్వాత మరిన్ని నగరాలకు విస్తరిస్తామని తెలిపారు. దేశంలో ఒక మిడ్‌సైజ్ మోటార్ సైకిల్ బ్రాండ్ తన పూర్తి పోర్ట్‌ఫోలియోను ఇలా ఇ-కామర్స్ వేదికగా అందుబాటులోకి తేవడం ఇదే తొలిసారి. యువతకు చేరువయ్యేందుకు ఈ ప్రయత్నం ఉపయోగపడుతుందని కంపెనీ భావిస్తోంది.

## హిండెన్‌బర్గ్ ఆరోపణలు..
## అదానీ గ్రూప్‌కు సెబీ క్లీన్‌చిట్!






**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలకు సంబంధించి అదానీ గ్రూప్ ఛైర్‌పర్సన్ గౌతమ్ అదానీకి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) గురువారం క్లీన్ చిట్ ఇచ్చింది. ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అని పేర్కొంది. సెప్టెంబర్ 18 నాటి రెండు వేర్వేరు ఉత్తర్వులలో హిండెన్‌బర్గ్ ఆరోపణలకు సంబంధించి అదానీ గ్రూప్‌పై ఎటువంటి జరిమానా విధించడం లేదని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ పేర్కొంది.

అదానీ గ్రూప్.. రుణాలను వడ్డీతో తిరిగి చెల్లించారని, నిధులను పక్కదారి పట్టించలేదని, అందువల్ల మోసం లేదా అన్యాయమైన వాణిజ్య పద్ధతి లేదని సెబీ వెల్లడించింది. అదానీ పోర్ట్స్ అడికార్ప్ ఎంటర్‌ప్రైజెస్‌కు నిధులను బదిలీ చేసిందని, ఆ నిధులను అదానీ పవర్‌కు రుణాలుగా అందించిందని సెబీ తన దర్యాప్తులో కనుగొందని, అయితే అదానీ పవర్ అడికార్ప్ ఎంటర్‌ప్రైజెస్‌కు రుణాలను తిరిగి చెల్లించింది, తరువాత అది వడ్డీతో అదానీ పోర్ట్స్‌కు తిరిగి చెల్లించింది. అదేవిధంగా దర్యాప్తు చేస్తున్న మరో కేసులో అదానీ పోర్ట్స్ మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్‌కు నిధులను రుణంగా బదిలీ చేసి, తరువాత వాటిని అదానీ పవర్‌కు బదిలీ చేసింది. కానీ అదానీ పవర్ మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్‌కు రుణాన్ని తిరిగి చెల్లించింది, ఆ తర్వాత అది వడ్డీలతో అదానీ పోర్ట్స్‌కు తిరిగి చెల్లించిందని సెబీ పేర్కొంది. అందువల్ల దర్యాప్తు కాలంలో వివిధ దశలలో రుణాలు చెల్లించారని, ఆ తర్వాత వడ్డీతో తిరిగి చెల్లించినట్లు సెబీ నిర్ధారించింది.

**సెబీ తీర్పును స్వాగతించిన గౌతమ్ అదానీ**

అదానీ గ్రూప్ ఛైర్‌పర్సన్ గౌతమ్ అదానీ సెబీ తీర్పును స్వాగతించారు. తమ గ్రూప్ భారతదేశ సంస్థలు, భారత ప్రజలకు కట్టుబడి ఉందని చెప్పారు. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను నిరాధారమైనవి అని కొట్టిపారేశారు. తమ గ్రూప్ ఎల్లప్పుడూ పారదర్శకత, సమగ్రతను కాపాడుతుందని ఆయన అన్నారు. ఈ మోసపూరిత, ప్రేరేపిత నివేదిక కారణంగా డబ్బు కోల్పోయిన పెట్టుబడిదారుల బాధను తాము అర్థం చేసుకోగలమని అన్నారు.

# పసికూన ఒమన్‌పై చెమటోడ్చి నెగ్గిన భారత్

**అబుదాబి:** ఆసియా కప్‌లో భాగంగా పసికూన ఒమన్‌తో జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో భారత్ 21 పరుగుల తేడాతో చెమటోడ్చి నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా 20 ఓవర్లలో 188/8 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (56), అభిషేక్ శర్మ (38), తిలక్ వర్మ (29), అక్షర్ పటేల్ (26) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. ఆ జట్టులో ఆమిర్ ఖలీమ్ (64: 46 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలు), హమద్ మిర్జా (51: 33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సలు) అర్ధశతకాలతో చెలరేగగా, జితేందర్ సింగ్ (32) రాణించాడు.






**చెలరేగిన ఖలీమ్, మిర్జా..**

189 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 56 పరుగుల వద్ద కుల్‌దీప్ బౌలింగ్‌లో జితేందర్ సింగ్ ఔట్ కావడంతో తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన మిర్జాతో జట్టు కట్టిన ఖలీమ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఇద్దరు బ్యాటర్లు బౌండరీలతో విరుచుకుపడడంతో ఆ జట్టు 15 ఓవర్లలో 116/1 పరుగులతో నిలిచింది. 16 ఓవర్లో కుల్‌దీప్ బౌలింగ్ తొలి రెండు బంతుల్లో మిర్జా రెండు సిక్సలు బాదాడు. 17వ ఓవర్లో ఇద్దరు బ్యాటర్లు చెరో ఫోర్ కొట్టారు. దీంతో సమీకరణం 18 బంతుల్లో 48 పరుగులుగా మారింది. 18 ఓవర్లో హర్షిత్ రాణా బౌలింగ్‌లో తొలి రెండు బంతులను ఖలీమ్ బౌండరీ దాటించాడు. నాలుగో బంతికి ఖలీమ్ భారీ షాట్ కొట్టగా.. బౌండరీ వద్ద ఉన్న హార్దిక్ ముందుకు పరుగెడుతూ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. దీంతో 93 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. 19వ ఓవర్లో హార్దిక్ బౌలింగ్‌లో మిర్జా ఔటయ్యాడు. ఈ ఓవర్‌లో కేవలం ఆరు పరుగులే వచ్చాయి. 20వ ఓవర్ తొలి బంతికే వికెట్ తీసి అర్షదీప్ సింగ్ టీ20ల్లో 100 వికెట్ల క్లబ్‌లో చేరిపోయాడు. ఈ మ్యాచ్‌లో 8 మంది భారత ఆటగాళ్లు బౌలింగ్ చేయడం గమనార్హం. ఈనెల 21న ఇండియా, పాక్‌లు సూపర్-4లో తలపడనున్నాయి.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ రెండో ఓవర్లోనే గిల్ (5) వికెట్‌ను కోల్పోయింది. అనంతరం సంజూ శాంసన్ (56: 45 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సలు)తో జట్టు కట్టిన అభిషేక్ (38: 15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సలు) ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. రెండో వికెట్‌కు వీరు 62 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈక్రమంలో 8 ఓవర్ తొలి బంతికి జితేన్ రామనంది బౌలింగ్‌లో అభిషేక్ క్యాచ్ ఔట్ అయ్యాడు. తర్వాత వచ్చిన హార్దిక్ (1) రెండు బంతుల తేడాతో వెనుదిరిగాడు. అనంతరం అక్షర్ (26: 13 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి శాంసన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 12 ఓవర్ నాలుగో బంతికి ఆమిర్ ఖలీమ్ బౌలింగ్‌లో అక్షర్ ఔటయ్యాడు. అప్పటికి భారత్ స్కోర్ 118 పరుగులు. శివమ్ దూబె (5) సైతం ఖలీమ్ బౌలింగ్‌లోనే పెవిలియన్ చేరాడు. తర్వాత వచ్చిన తిలక్ వర్మ (29: 18 బంతుల్లో 1 ఫోర్, 2సిక్సలు) వేగంగా పరుగులు చేశాడు. 171 పరుగుల వద్ద శాంసన్ ఆరో వికెట్‌గా ఔటయ్యాడు.

## మరోసారి హెచ్‌సీఏ వివాదం..

**బీసీసీఐకి ఫిర్యాదు**

**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో మరోసారి వివాదం చెలరేగింది. హెచ్‌సీఏ తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్న దల్జిత్ సింగ్‌పై పలువురు క్లబ్ సెక్రటరీలు భారత క్రికెట్ నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. కాగా ఈ నెల 28న ముంబై లో బీసీసిఐ 95వ వార్షిక సభ్య సమావేశం జరుగనుంది.




ఈ నేపథ్యంలో ఏజీఎంలో పాల్గొనేందుకు బీసీసీఐ... అన్ని రాష్ట్రాల క్రికెట్ అసోసియేషన్‌లకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా హెచ్‌సీఏకు కూడా ఆహ్వానం అందింది. ఈ క్రమంలో యాక్టింగ్ ప్రెసిడెంట్‌గా దల్జిత్ ఉండటం నిబంధనలకు విరుద్ధం అంటూ పలువురు క్లబ్ సెక్రటరీలు బీసీసీఐకి లేఖలు రాశారు. అదే విధంగా.. దల్జిత్‌పై సింగిల్ మెంబర్ కమిటీ జస్టిస్ నవీన్ రావ్‌కు కూడా వీరు ఫిర్యాదు చేశారు.

కాగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీఐడీ హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును జూలై నెలలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడితో పాటు కోశాధికారి శ్రీనివాస్ రావు, సీఈఓ సునీల్ కంటే, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు కవితలను కూడా సీఐడీ అరెస్టు చేసింది.

ఈ క్రమంలో జగన్మోహన్ రావు అక్రమ పద్ధతిలో హెచ్‌సీఏలోకి ప్రవేశించినట్లు సీఐడీ గుర్తించింది. ఈ పరిణామాల నేపథ్యంలో అధ్యక్షుడిగా జగన్మోహన్ రావును తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అతడి స్థానంలో దల్జిత్ సింగ్ తాత్కాలిక అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు.

## ఆస్ట్రేలియాకు షాకిచ్చిన ఐసీసీ

**మ్యాచ్ ఫీజులో భారీ కోత..!**




**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్ సన్నాహక వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియాకు భారత జట్టు భారీ ఓటమిని రుచి చూపించింది. ఏకంగా102 పరుగుల తేడాతో గెలుపొందిన హర్మన్‌ప్రీత్ సేన ఆసీస్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. అసలే పరాజయం బాధలో ఉన్న కంగారూ జట్టుకు మరో షాక్ తగిలింది. రెండో వన్డేలో ఐసీసీ నిబంధనలను పాటించకపోవడంతో మ్యాచ్ ఫీజులో కోత విధించింది. ముల్లన్‌పూర్‌లో సెప్టెంబర్ 17న ఆసీస్ టీమ్ స్లో ఓవర్ రేటు నమోదు చేసింది. దాంతో, 10శాతం మ్యాచ్ డబ్బులను కట్ చేయనుంది.

రెండో వన్డేలో మొదట భారత్ బ్యాటింగ్ చేయగా నిర్ణీత సమయానికి ఆస్ట్రేలియా ఓవర్ల కోటాను పూర్తి చేయలేదు. 48 ఓవర్లు మాత్రమే వేసింది. దాంతో.. ఈ విషయమై రిఫరీ ఫిర్యాదు చేయగా ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హేలీ తమ నేరాన్ని అంగీకరించింది. ఐసీసీ నియమావళి 2.2 ప్రకారం కేటాయించిన సమయం లోపు ఓవర్ల కోటా పూర్తి చేయాలి. లేదంటే ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి మ్యాచ్ ఫీజులో 5 శాతం కోల్పోతారు. అదే.. రెండు ఓవర్లు ఆలస్యమైతే ఏకంగా పది శాతం డబ్బును ఐసీసీకి చెల్లించాల్సి ఉంటుంది.

మూడు వన్డేల సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా చెరొక మ్యాచ్ గెలుపొందాయి. తొలి వన్డేలో ఆసీస్ విజయం సాధించగా.. రెండో మ్యాచ్‌లో స్మృతి మంధాన మెరుపు శతకంతో టీమిండియా భారీ తేడాతో జయభేరి మోగించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మూడో మ్యాచ్ సెప్టెంబర్ 20 శనివారం నాడు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగనుంది. సెప్టెంబర్ 30 నుంచి సొంతగడ్డపై వరల్డ్ కప్ ప్రారంభం కానున్నందున విజయంతో టోర్నీలో అడుగుపెట్టాలని హర్మన్‌ప్రీత్ సేన భావిస్తోంది.

# పంత్‌కు డేంజర్ బెల్స్..

**జురెల్ స్ట్రాంగ్ వార్నింగ్**

**న్యూఢిల్లీ:** ధోని రిటైర్మెంట్ తర్వాత భారత టెస్ట్ జట్టు వికెట్‌కీపింగ్ బ్యాటర్ స్థానాన్ని రిషబ్ పంత్ సుస్థిరం చేసుకున్నాడు. మధ్యలో కేఎస్ భరత్, ఇషాన్ కిషన్‌కు అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. పంత్ గైర్హాజరీలో కేఎల్ రాహుల్ వికెట్‌కీపింగ్ బాధ్యతలు చేపట్టినా.. అది తాత్కాలికమే. భారత మేనేజ్‌మెంట్ రాహుల్‌ను టెస్ట్‌ల్లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా మాత్రమే పరిగణిస్తుంది.

ప్రస్తుతానికి భారత టెస్ట్ జట్టులో పంత్ స్థానానికి ఎలాంటి ఢోకా లేదు. అయితే మధ్యమధ్యలో అతని గాయాలే మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతున్నాయి. తాజాగా ఇంగ్లండ్ పర్యటనలో పంత్ అరివీర భయంకరమైన ఫామ్‌లో ఉండగా గాయపడ్డాడు. ఆ సిరీస్‌లో పంత్‌కు ప్రత్యామ్నాయ వికెట్‌కీపర్‌గా ధృవ్ జురెల్ ఉండటంతో టీమిండియాకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. చివరి టెస్ట్‌లో జురెల్ ఓ మోస్తరు ప్రదర్శనలతో పర్వాలేదనిపించాడు.




ఇంత వరకు అంతా బాగానే ఉంది. పంత్ అందుబాటులో లేనప్పుడే జురెల్‌కు అవకాశాలు వస్తున్నాయి. అయితే తాజాగా జురెల్ ఆస్ట్రేలియా-ఏపై చేసిన అద్భుత శతకం టీమిండియాలో పంత్ స్థానాన్ని ఛాలెంజ్ చేస్తుంది.

ఆసీస్-ఏపై జురెల్ ఏదో గాలివాటంగా సెంచరీ చేయలేదు. పక్కా ప్రణాళిక ప్రకారం, భారత టెస్ట్ జట్టులో స్థానమే లక్ష్యంగా చేసిన సెంచరీలా ఉందది. గత కొంతకాలంగా జురెల్ ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ఇలాంటి ప్రదర్శనలే చేస్తున్నాడు. అయితే పంత్ ఫామ్‌లో ఉండటంతో వాటికి పెద్దగా ప్రాధాన్యత లభించలేదు.

జురెల్ తాజా సెంచరీ మాత్రం అలా కాదు. ఈ సెంచరీకి చాలా విలువ ఉంది. జురెల్ సరైన సమయంలో శతక్కొట్టి పంత్ స్థానానికి ఛాలెంజ్ విసిరాడు. త్వరలో (అక్టోబర్ 2) భారత్ స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు గట్టిగా 10 రోజుల సమయం మాత్రమే ఉంది.

పంత్ ఇప్పటికి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. ఇలాంటి తరుణంలో సెలెక్టర్లకు జురెల్ తప్పక మొదటి ప్రాధాన్యత అవుతాడు. జురెల్ విండీస్ సిరీస్‌లో సాధారణ ప్రదర్శనలతో మమ అనిపిస్తే ఎలాంటి సమస్య లేదు. ఒకవేళ అతను ఆ సిరీస్‌లో ఎప్పటిలాగే చెలరేగితే మాత్రం పంత్‌కు డేంజర్ బెల్స్ మోగినట్లే.

ఎందుకంటే ఇప్పటిదాకా సెలెక్టర్లకు పంత్ మాత్రమే ఛాయిస్‌గా ఉన్నాడు. విండీస్‌తో సిరీస్‌లో జురెల్ రాణిస్తే.. వారి ఛాయిస్ తప్పక మారుతుంది. ఎందుకంటే జురెల్ ఒకటి అరా మ్యాచ్‌ల్లో రాణించిన ఆటగాడు కాదు. అతను సుదీర్ఘ ఫార్మాట్‌లో ఎక్కడ ఆడినా అద్భుతాలే చేశాడు. ముఖ్యంగా భారత-ఏ జట్టు తరపున అతని రికార్డు అత్యద్భుతంగా ఉంది. సౌతాఫ్రికాలో సౌతాఫ్రికా-ఏపై 69(166) స్కోర్లు చేశాడు. ఇంత ఘనమైన ట్రాక్ రికార్డుతో జురెల్ తప్పక పంత్‌కు ప్రత్యామ్నాయం అవుతాడు. కాబట్టి పంత్ ఇకపై జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే అతని స్థానాన్ని జురెల్ ఎగరేసుకుపోవడం ఖాయం.

# కాంతార చాప్టర్-1 ముహూర్తం ఫిక్స్




**టాకీస్:** కన్నడ నుంచి రాబోతున్న ప్రెస్టీజియస్ ప్రాజెక్టులలో 'కాంతార: చాప్టర్ 1' ఒకటి. కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం కాంతార సినిమాకు ప్రీక్వెల్‌గా వస్తుంది. ఈ సినిమాని హొంబలే ఫిల్మ్స్ నిర్మిస్తుండగా.. రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. వరల్డ్‌వైడ్‌గా అక్టోబర్ 02 ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ మొదలుపెట్టారు మేకర్స్. ఇందులో భాగంగానే తాజాగా ట్రైలర్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా ట్రైలర్‌ను సెప్టెంబర్ 22న మధ్యాహ్నం 12.45 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపింది. దాదాపు రూ. 400 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కాబోతుంది.

# దుమ్ము రేపుతున్న శాన్వీ శ్రీవాస్తవ

టాకీస్: ఈ బ్యూటీ చేసింది తెలుగులో నాలుగు సినిమాలే.. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. కొన్ని సినిమాల్లో తన అందంతో ప్రేక్షకులను కవ్వించింది. కానీ చేసిన సినిమాల్లో మొదటి సినిమా తప్ప మిగిలినవి అన్ని ఫ్లాప్ అయ్యాయి. దాంతో ఆమె తెలుగు సినిమాలకు పూర్తిగా దూరం అయ్యింది. ఇంతరభాషల్లో సినిమాలు చేస్తుంది. కానీ అక్కడ కూడా స్టార్ గా ఎదగలేకపోయింది. లవ్లీ సినిమా గుర్తుందా.? అది సాయి కుమార్ హీరోగా నటించిన ఈ సినిమాకు బీఏ జయ దర్శకత్వం వహించారు. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించింది శాన్వీ శ్రీవాస్తవ. తొలి సినిమాతోనే తన క్యూట్ పర్ఫామెన్స్ తో కవ్వించింది. ఆతర్వాత ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ వచ్చాయి. సుశాంత్ అడ్డా, మంచు విష్ణు రౌడీ, మరోసారి ఆదితో ప్యార్ మే పడిపోయానే సినిమాల్లో నటించింది. కానీ అవేమి వర్కౌట్ కాలేదు. దాంతో కన్నడ ఇండస్ట్రీకి వెళ్ళింది. అక్కడ కాస్త పర్లేదు అనిపించుకుంది. ఆ మధ్య అతడే శ్రీమన్నారాయణ డబ్బింగ్ మూవీతో మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఆ సమయంలో శాన్వీ మాట్లాడుతూ తెలుగులో అవకాశాలు రావడం లేదు అని కన్నీళ్లు పెట్టుకుంది. తనకు ఎందుకు ఛాన్స్ లు రాలేదో అర్థం కావడం లేదు అని స్టేజ్ పైనే కన్నీళ్లు పెట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఇప్పుడు కన్నడలోనే సినిమాలు చేస్తుంది. అక్కడ కూడా ప్రస్తుతం శాన్వీ శ్రీవాస్తవకు చెప్పుకోదగ్గ సినిమాలు రావడం లేదు. సోషల్ మీడియాతోనే ఈ చిన్నది కాలం గడిపేస్తుంది. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.




# అందంతో ఆకట్టుకుంటున్న మడోన్నా సెబాస్టియన్..



టాకీస్: అందాల భామ మడోన్నా సెబాస్టియన్.. ఈ అమ్మడు అక్టోబర్ 1, 1992న కేరళలోని చెరుపుజలో జన్మించింది. ఈ ముద్దుగుమ్మ బెంగుళూరులోని క్రైస్ట్ యూనివర్శిటీ నుంచి బిజినెస్ స్టడీలో పట్టా అందుకుంది. ఈ అమ్మడు మొదట మలయాళంలో విడుదలైన ఒక మ్యూజిక్ షోలో యాంకర్‌గా పని చేసింది. ఈ అమ్మడు మొదట మలయాళంలో విడుదలైన ఒక మ్యూజిక్ షోలో యాంకర్‌గా పని చేసింది. ఈ షో ద్వారా ఫేమస్ అయ్యి తొలిసారి సినిమాల్లో నటించే అవకాశం అందుకుంది. అలాగే సినిమాల్లోనూ మంచి సక్సెస్ అందుకుంది. ఇదిలా ఉంటే అల్ఫోన్స్ దర్శకత్వంలో నివిన్ పాలీ, సాయి పల్లవి, మడోనా, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన "ప్రేమమ్" చిత్రం 2015లో విడుదలైంది. ఈ చిత్రం మలయాళంలోనే కాకుండా తమిళం, తెలుగు భాషల్లో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీని తరువాత, ఆమె 2016లో నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించిన విజయ్ సేతుపతి చిత్రం వాలంతుమ్ పార్థియంతో తమిళ తెరపైకి అడుగుపెట్టింది. ఇక తెలుగులో నాగ చైతన్య నటించిన ప్రేమమ్ సినిమాతో పరిచయం అయ్యింది. చాలా కాలం తర్వాత నాని హీరోగా నటించిన శ్యామ్ సింగరాయ్ సినిమాలో నటించింది. ప్రస్తుతం మడోనా తెలుగు సినిమాల కంటే తమిళ్, మలయాళ సినిమాల పైనే ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ వరుసగా సినిమాలు చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటోంది ఈ అమ్మడు.

### కుర్రకారులకు హీటెక్కిస్తున్న

# అనుపమ పరమేశ్వరన్

టాకీస్: అందాల ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సింపుల్‌గా కనిపిస్తూనే కుర్రకారు మనసుదోచేస్తుంది ఈ బ్యూటీ. తాజాగా ఈ అమ్మడు చుఢీదార్‌లో తన అంద చందాలతో మతి పోగొడుతుంది. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓ లుక్ వేయండి. బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా రెండు సినిమాలతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. అందులో ఒకటి డిజాస్టర్ అయినా మరో మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. దీంతో ఈ బ్యూటీ కెరీర్ మరింత ఫామ్‌లోకి వచ్చిందనే చెప్పాలి. ప్రేమమ్ మూవీతో తెలుగు వెండితెరకు పరిచయమైన చిన్నది అనుపమ పరమేశ్వరన్, ఈ అమ్మడు మొదటి సినిమాతో మంచి ఫేమ్ తెచ్చుకుంది. దీంతో వరసగా ఆఫర్స్ అందుకుంటూ, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్‌గా తన సత్తా చాటుతుంది. రీసెంట్‌గా పరదా మూవీతో తెలుగు అభిమానులను పలకరించింది ఈ బ్యూటీ కానీ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. కానీ కిష్కిందపురి సినిమాతో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకొంది. ఈ అమ్మడు డీజే టిల్లు స్క్వేర్ మూవీతో మంచి ఫాన్ ఫాలో యింగ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు గ్లామర్ కు ప్రతి ఒక్కరూ ఫిదా అయ్యారు.దీంతో ఈ మూవీ తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంటూ బ్లాక్ బస్టర్స్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటుంది. సక్సెస్ జోష్‌లో ఉన్న ఈ చిన్నది తాజాగా చుఢీదార్‌లో తన అంద చందాలతో అందరి మనసు దోచేస్తూ నెట్టింట హల్ చల్ చేస్తుంది.



# రోబో శంకర్ మృతిపై కమల్ సంతాపం

**టాకీస్:** కోలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ హాస్యనటుడు రోబో శంకర్ (46) కన్నుమూసిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తమిళ సినీ పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి. రోబో శంకర్ కమల్ హాసన్‌కి వీరాభిమాని. అయితే తన అభిమాని చనిపోయాడన్న వార్త తెలుసుకున్న నటుడు కమల్ హాసన్



సోషల్ మీడియా వేదికగా అతడికి నివాళులు అర్పించాడు. రోబో శంకర్.. నీ పేరులో ఉన్న రోబో ఒక ముద్దుపేరు మాత్రమే. నువ్వు నా తమ్ముడివి. నువ్వు లేని లోటు మమ్మల్ని బాధపెడుతున్నా నువ్వు మా నుంచి దూరంగా వెళ్ళిపోయావు. నీ పని పూర్తి చేసుకుని వెళ్ళిపోయావు, కానీ నా పని ఇంకా మిగిలి ఉంది. రేపటిని మాకోసం వదిలి వెళ్ళిపోయావు. కాబట్టి రేపు మనదే అంటూ కమల్ రాసుకోచ్చాడు. ఇక రోబో శంకర్ అంత్యక్రియలు శుక్రవారం చెన్నైలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య ప్రియాంక,

# మోహన్‌లాల్ వృషభ ట్రైలర్ విడుదల

టాకీస్: మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. ఈ సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్. వ్యాస్ స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్



మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియాగా రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీ టీజర్ చూస్తుంటే.. మోహన్‌లాల్ ఇందులో యోధుడి పాత్రలో కనిపించనున్నారు. యాక్షన్ ప్యాక్‌డ్‌గా ఉన్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.